మిర్చి పనులకు కూలీల కొరత


మిర్చి ఏరుతున్న కూలీలు


ఆరబోసిన మిర్చి

- రోజుల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి
- ఇతర ప్రాంతాల నుంచి తరలింపు
- పెట్టుబడి వచ్చేలా లేదని రైతుల ఆందోళన

నడికూడ : మిర్చి పనులకు కూలీల కొరత వేధిస్తోంది. మండల పరిధిలో సుమారు 2,400 ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిర్చి రైతులకు ప్రస్తుతం మార్కెట్లో ధర తక్కువ పలకడం, కూలీల కొరతతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో పరకాల, అంబాల, కమలాపూర్, హసన్‌పర్తి, హుజూరాబాద్ నుంచి కూలీలను తీసుకొస్తూ మిర్చి ఏరివేతను కొనసాగిస్తున్నారు. ఇటీవల మండల పరిధిలో ఓ ట్రాలీ ఆటో ప్రమాదం జరగడంతో ట్రాలీ ఆటో యజమానులు కూలీలను తీసుకువచ్చేందుకు వెనుకడుగు వేస్తుండడంతో కూలీలకు మరింత డిమాండ్ పెరిగిందని రైతులు వాపోతున్నారు. ఒక్కొక్క కూలీకి రూ.270 నుంచి రూ.300తో కూలి చెల్లిస్తూ అదనంగా ఆటో చార్జలను ఇస్తున్నామని రైతులు తెలిపారు. రైతులు విక్రయించేందుకు మార్కెట్‌కు వెళ్తే అక్కడ క్వింటాల్‌కు రూ.12 వేలు నుంచి రూ.13 వేలుకు మించి కొనుగోలు చేయడం లేదని, దీంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. ఓ వైపు తెగుళ్లతో దిగుబడి తగ్గిందని దీంతో దిక్కుతోచని స్థితిలో పడినట్లు తెలిపారు.

పెట్టుబడి పెరిగింది



గతేడాది కంటే మిర్చికి తక్కువ ధర పలకడంతో పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి కనిపించడం లేదు. కూలీల కొరతతో పొరుగూరి నుంచి కూలీలను తీసుకుస్తే మరింత భారం తప్పడం లేదు. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి.

- ఊర శ్రీనివాస్‌రావు, నడికూడ

వసూళ్లకు పాల్పడితే జైలుకే : గండ్ర


పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట : ప్రభుత్వ పథకాల అమలు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ ప్రజల నుంచి ఎవరైనా వసూళ్లకు పాల్పడితే జైలుకు పంపిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. అధికారులు, నాయకులు అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం గట్లకానిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని అంబేడ్కర్, పూలే, గాంధీ లాంటి గొప్ప వాళ్ల ఆలోచనలతో కూడిన పవిత్ర గ్రంథమన్నారు. రాజ్యాంగాన్ని బీజేపీ మార్చాలని చూస్తోందని, కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించారని ఆరోపించారు. గాంధీ, అంబేడ్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్ కుమార్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ సభ్యుడు చంద్రప్రకాశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



కమలాపూర్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పుల్ల కొమురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్‌కుమార్, మండల అధ్యక్షుడు పుల్ల హేమంత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో అంబేడ్కర్ జయంతోత్సవ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాట్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా శనిగరపు వంశీ, మాట్ల రాజు, దేవరాజు కుమార్, పుల్ల రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ అశోక్, కార్యదర్శిగా ఇసంపెల్లి ప్రేమ్‌సాగర్, ప్రచార కార్యదర్శిగా పుల్ల శ్రీకాంత్, కోశాధికారిగా పుల్ల అయిలయ్య, గౌరవ సలహాదారులుగా పుల్ల శ్రీనివాస్, పుల్ల శంకర్, శనిగరపు జనార్దన్, పుల్ల శోభన్‌బాబు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా పుల్ల కుమారస్వామి, జన్ను రమేశ్, పుల్ల పున్నంచందర్, శనిగరపు రమేశ్, శ్రీధర్, భాస్కర్, వివేక్, సన్నీ, సందీప్ తదితరులు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

డీసీఓను కలిసిన పీఏసీఎస్ వైస్ చైర్మన్



శాయంపేట : ఇటీవల మంచిర్యాల జిల్లా నుంచి హనుకొండ డీసీఓగా బాధ్యతలు స్వీకరించిన బొక్క సంజీవరెడ్డిని శుక్రవారం శాయంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించారు.

ఆర్థికసాయం అందజేత

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన చెంగెల్లి రాజమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.9500 రూపాయలు, బీఆర్ఎస్ నాయకులు రూ. 7500 వేర్వేరుగా అందించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమారస్వామి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్, నాయకులు లక్ష్మణ్, శ్రావణ్, సుమన్, శంకర్, కృష్ణ, కిషన్, సాంబయ్య, చంద్రమౌళి, రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు పరమేశ్, లక్ష్మారెడ్డి, రాజయ్య, అశోక్, అశోక్, రాజు, రమేశ్, జితేందర్, రాజయ్య, రమేశ్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పరకాల : పరకాల బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు పి.వేణుయాదవ్, జంగిలి రాజు తెలిపారు. శుక్రవారం నామినేషన్ ప్రక్రియ నిర్వహించగా అధ్యక్షుడిగా పెండ్యాల భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా డి.రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ సాబీర్, కోశాధికారిగా రాహుల్ విక్రమ్, ఈసీ సభ్యుడిగా ప్రవీణ్‌కుమార్ నామినేషన్ వేయగా పోటీలో ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారులు వేణుయాదవ్, రాజు తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

నడికూడ : తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాల 4వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల నుంచి 9 మంది ప్రవేశ పరీక్ష రాయగా 7గురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి 16 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా 11 మంది అర్హత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వరంగల్‌లోని హంటర్ రోడ్డు బొందివాగు, రామా టాకీస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమకొండలోని కొత్త బస్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, టీచర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, సోమిడి వ్యవసాయ ఫీడర్, టేకులగూడెం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి గోవిందరాజుల బ్రహ్మోత్సవాలు

వరంగల్ చౌరస్తా: ఈనెల 5 నుంచి 26వ తేదీ వరకు గోవిందరాజుల స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మిట్టపల్లి భాస్కర్ తెలిపారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న అనూష

ఎల్కతుర్తి : సఖి సేవలను వినియోగించుకోవాలని సఖి లీగల్ అడ్వైజర్ అనూష అన్నారు. మండల కేంద్రంలోని వల్భాపూర్ గ్రామంలో మహిళ శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు సఖి అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేధింపులకు గురయ్యే మహిళలకు సఖి కేంద్రం ఐదు రకాల సేవలు అందిస్తుందన్నారు. కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం అందిస్తుందన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలకు గురయ్యే బాధిత మహిళలు వెంటనే సఖి సెంటర్‌ను సంప్రదించాలని, లేనిపక్షంలో 181 మహిళా హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సదస్సులో వీఓఏ రజిత, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ లీడర్స్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24 మంది కుల బహిష్కరణ

- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- కమలాపూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


గోడు వెళ్లబోసుకుంటున్న బండి రాజు

కమలాపూర్ : తాము ఏ తప్పు చేయకున్నా అకారణంగా కుల బహిష్కరణ చేశారని హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ముదిరాజ్ కులస్తులు బండి రాజు తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే.. తాము కమలాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యులం. సంఘంలో నాలుగు వర్గాలు ఉన్నాయి. ఏడాదికి ఒకసారి వర్గానికి ఇద్దరు చొప్పున ఎనిమిది మందిమి కలిసి సంఘానికి వచ్చిన ఆదాయం, ఖర్చులను సరి చూసుకుంటాం. 2021–22, 2022–23 సంవత్సరాల లెక్కలు చేసే క్రమంలో అప్పటి కార్యవర్గాన్ని డబ్బులు అడగ్గా అధ్యక్షుడు కొండ మొగిలి తన బ్యాంకు ఖాతాలో రూ.40 లక్షలు ఉన్నాయి.. మీరు లెక్కలు చేయండి.. తేలిన డబ్బులు ఇస్తామనడంతో లెక్కలు చేశాం. మొగిలి సంఘానికి రూ.16.40 లక్షలు ఇవ్వాల్సిందిగా లెక్క తేలగా కుల సభ్యులకు అప్పగించాలని చెప్పాం. ఏడాదిగా దాటవేసి.. ఆ తర్వాత డబ్బులు సంఘం కార్యదర్శి బండి కుమారస్వామి వద్ద ఉన్నాయని, అతనే ఇస్తాడని చెప్పగా.. అతను కూడా చెల్లించలేదు. దీంతో కుమారస్వామి ×బండి¥ వర్గానికి చెందిన వ్యక్తి అని, ఆ డబ్బులు మీరే చెల్లించాలంటూ బండి వర్గానికి చెందిన 24 మందిని సాంఘిక కుల బహిష్కరణ చేసి డబ్బులు చెల్లించిన తర్వాతే సంఘంలోకి రావాలని అన్నట్లు వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి తమను ఎలాంటి కార్యక్రమాలకు రానివ్వడం లేదని వాపోయారు. ఆ తర్వాత కొత్త కార్యవర్గం ఏర్పాటైందని, వారు కూడా పాత కార్యవర్గం మాదిరిగానే ఉగాది రోజు సంప్రదాయంగా వచ్చే చేపలను కూడా తమకు ఇవ్వలేదని ఆరోపించారు. మౌటం కుమారస్వామి అనే వ్యక్తి వీరి వెనుక ఉండి ఇదంతా నడిపిస్తున్నాడని ఆరోపించారు. తమను కుల బహిష్కరణ చేసి వేధిస్తున్న పాత, కొత్త కార్యవర్గంతో పాటు వీరి వెనుక ఉన్న మౌటం కుమారస్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ తిరుమల్, కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎలాంటి కుల బహిష్కరణలు లేవు..

కాగా సంఘం ప్రస్తుత అధ్యక్షుడు మౌటం మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమ సంఘంలో ఎలాంటి కుల బహిష్కరణలు లేవని, ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు గతంలో నక్సలైట్లుగా పని చేసి ప్రస్తుతం మాజీ నక్సలైట్లుగా ఉంటూ సంఘ పరిధిలోని వ్యవహారాల్లో సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, వారి ఆగడాలను అడ్డుకుంటున్నందుకు కులాన్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నించి అది వీలు కాకపోవడంతో పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుల బహిష్కరణపై ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను వివరణ కోరగా దీనిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే ‘కడియం’ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వేలేరు : సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మను మండలంలోని షోడాషపల్లిలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎంతగానో కృషిచేశారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో వేలేరు మండలానికి రూ.104 కోట్ల నిధులు తీసుకువచ్చి సాగునీరు పనులు ప్రారంభించారని, డబుల్ రోడ్డు నిర్మాణం, మండల ఏర్పాటు చేసిన ఘనత పల్లాకే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యక్తిగత దూషణలకు దిగకుండా ఉండాలని, లేనిపక్షంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, రాజేశ్వర్‌రెడ్డి, జానీ, శ్రీనివాస్‌తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్

సీపీ సన్‌ప్రీత్ సింగ్


మట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

పరకాల : నేరాల నియంత్రించేందుకు విజిబుల్ పోలీసింగ్ అవసరమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా శుక్రవారం పరకాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పోలీసు స్టేషన్ పరిసరాలను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలను అడిగితెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా ఏలాంటి కేసులు నమోదవుతున్నాయని సీఐ క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్‌లు ఉన్నాయని, సెక్టార్ వారీగా ఎస్సైలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీషీటర్స్, అనుమానిలు, వారి ప్రస్తుత స్థితిగతులను సంబంధిత సెక్టార్ ఎస్సైని అడిగితెలుసుకున్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విజిబుల్ పోలీసింగ్ కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, పరకాల ఏసీపీ సతీష్‌బాబు ఉన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు వలదాసు దుర్గయ్య డిమాండ్ చేశారు. వరంగల్ 43వ డివిజన్ తిమ్మాపురం రోడ్డులోని లక్ష్మీపురంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయాలని కోరారు.

‘కడియం శ్రీహరికి మతిభ్రమించింది’

మాజీ ఎమ్మెల్యే రాజయ్య


మాట్లాడుతున్న రాజయ్య

ధర్మసాగర్ / వేలేరు : ఉపఎన్నికల టెన్షన్‌తో కడియం శ్రీహరికి మతిభ్రమించిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమంతా హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తుంటే కడియం శ్రీహరి సమర్థించడం హేయమైన చర్య అన్నారు. ఉప ఎన్నికల భయంతోనే రేవంత్‌రెడ్డిని కడియం శ్రీహరి జోకుతున్నారని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు ఇప్పటికే నాలుగుసార్లు సీఎంకు మొట్టికాయలు వేసిన తీరు మారలేదన్నారు. దేవాదుల మూడు ఫేసులు మాజీ సీఎం కేసీఆర్ పూర్తి చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మోటారు మెయింటెనెన్స్‌కు ఆరు కోట్లు నిధులు వెచ్చించలేకపోయిందని విమర్శించారు. అలాగే రజతోత్సవాలకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ కర్ర సోమిరెడ్డి, సీనియర్ నాయకు లు ప్రభుదాస్, కీర్తి వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్, రవీందర్, మధు పాల్గొన్నారు. అనంతరం ఆయన వేలేరు మండలంలోని పీచర గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27వ తేదీన నిర్వహించతలపెట్టిన రజతోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి : ఈనెల 27వ తేదీన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం, చింతలపల్లి గ్రామ సమీపంలో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సత్యసాయి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 27వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు లక్షలాది మంది తరలిరానున్నట్లు చెప్పారు. మండల నాయకులు, కార్యకర్తలు సభా స్థలాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకతతో ఉన్నారని, సభ భారీకు భారీగా తరలిరానున్నట్లు తెలిపారు. సభకు హాజరైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్క కార్యకర్తపై ఉందన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తంగెడ మహేందర్, కడారి రాజు, తంగెడ నగేశ్, ఎల్తూరి స్వామి, మహేందర్, వినయ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, సతీశ్, జడ్సన్, తిరుపతి, శంకర్, చిట్టిగౌడ్, రాజేశ్వర్‌రావు, రాజు, వెంకటేశ్‌యాదవ్, బాబురావు, సమ్మయ్య, చంద్రమౌళి, వలిపాషా, కృష్ణవేణి, భాగ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

టీపీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : భారత రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలంలోని ఆరెపల్లిలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని ధర్మారం, చంటయ్యపల్లి, కొత్తకొండ గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, చిట్టంపల్లి అయిలయ్య, గోలి రాజేశ్వర్‌రావు, గొర్రె మహేందర్, ముప్పు మహేందర్, ప్రకాశ్ రమేశ్, చంద్రశేఖర్ గుప్తా, అనిల్, శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలి

ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న


రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

వేలేరు : పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, పేద ప్రజల ఆకలి తీర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంపత్, రాజు, శ్రీనివాస్, రేషన్ డీలర్లు జైపాల్, అశోక్, ప్రభాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ఐనవోలు : మండలంలోని రెడ్డిపాలెం, నందనం గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైభీం, జైబాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు సమ్మయ్య, సాంబయ్య, బుచ్చిరెడ్డి, ఎలిషా, సాయిరెడ్డి, సాంబయ్య, రవి, రహీమ్‌పాషా, రాజు, యాదగిరి, సునీల్, బోజిరెడ్డి, హరీష్, భాస్కర్, రాజు, సంపత్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

హన్మకొండ: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గతనెల 23న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ నుంచి చేపట్టిన బస్సు యాత్ర రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల పర్యటనలో భాగంగా శుక్రవారం హనుమకొండకు చేరుకుంది. ముందుగా హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి ఫోరం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు ఈనెల 21న సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ఉద్యమకారుల ప్లీనరీకి తెలంగాణ ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, సీనియర్ న్యాయవాది వొడపల్లి శ్యామ్‌కృష్ణ, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, న్యాయవాది అనుముల రమేష్, ఉద్యమకారులు బాల్నే శ్రీనివాస్, కొంగరి రాజు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠ్యాశాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, దేవమ్మ పాల్గొన్నారు.